
# శేషప్రశ్న



'విజయ' మాసపత్రిక . . . మే, 1977

సాయంత్రం ఐదుగంటలు అవుతోంది!

ఆఫీసు బయట కాంపౌండ్‌లో ఏదో కలకలం వినిపిస్తోంది. 'ఏమిటా...' అని బయటికి వచ్చాడు రామారావు. అక్కడ ఒక పాతిక మంది వరకు జనం గుమిగూడి ఏమిటో వింత చూస్తున్నారు. అందులో ఆఫీసువాళ్ళు కూడా కొందరున్నారు. ఎవరో ఎవర్నో వేస్తున్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అయితే ఆ ప్రశ్నలు గాని, జవాబులు గాని స్పష్టంగా తెలియడం లేదు. ఒక చంటి పిల్లవాడి ఏడుపు బిగ్గరగానూ, ఇంకెవరో పిల్లవాడి సన్నగానూ వినిపిస్తున్నాయి. ఆ ఏడుపుల మధ్య, జనం చేసే రణగొణ ధ్వని మధ్య, ఏ మాటా స్పష్టంగా వినిపించడం లేదు.

"ఏమిటది? ఏమి జరిగింది?" అంటూ రామారావు ఆ గుంపు దగ్గరకి వచ్చాడు. అతను ఆఫీసులో సెక్షన్ ఆఫీసర్ అవడం వల్ల, అతని గొంతు వినగానే అక్కడ ఉన్న ఆ 'ఆఫీసు' ఉద్యోగులు దారి ఇచ్చారు.

"ఎవరో అమ్మాయి పడిపోయిందండీ!" అన్నారు ఎవరో.

ఎదురుగా చూశాడు రామారావు. ఆ దృశ్యం చూసేసరికి అతని గుండె తరుక్కుపోయింది. పరికిణీ, జాకెట్టు వేసుకున్న ఒక పన్నెండేళ్ల అమ్మాయి నేలమీద పడిపోయి ఉంది. ప్రక్కనే ఒక ఐదేళ్ల పిల్లవాడు, వాడి చంకలో ఉన్న ఏడాది పిల్లవాణ్ని సముదాయించలేక నానా బాధ పడుతున్నాడు. ఆ చంటి పిల్లవాడు మెలికలు తిరిగిపోతూ, గగ్గోలు పెట్టి ఏడుస్తూ, వాడి చంకలోంచి జారుకోవాలని విశ్వప్రయత్నం చేస్తున్నాడు. పడిపోయిన అక్కనీ, పట్టు వదిలించుకోవాలని గింజుకొంటున్న తమ్ముణ్ణీ చూస్తూ కన్నీళ్లు కారుస్తూ... "బాబూ ఏడవకు!" అంటూ సముదాయిస్తున్నాడు ఆ చిన్నవాడు.

"ఏం జరిగింది?" అని తిరిగి అడిగాడు రామారావు.

"వాళ్ళెవరికీ రెండు రోజుల నుంచి తిండి లేదటండీ... కళ్ళు తిరిగి పడిపోయింది!" అన్నాడు జనంలోంచి ఒకడు.

"అయ్యో పాపం! పడిపోతే అంతా చూస్తూ ఊరుకుంటారేమిటి? ఒరే దుర్గయ్యా... నువ్వెళ్లి గ్లాసుతో నీళ్లు తీసుకుని రారా! వెంకన్నా... నువ్వు వెళ్లి అర్జంటుగా బన్నూ, వేడి కాఫీ తీసుకురా! ఇవిగో డబ్బులు... ఫ్లాస్కు నా అల్మారాలో ఉంది తీసికెళ్లు! ఆలస్యం చేయకుండా ఇక్కడున్నట్లు రావాలి!" అంటూ త్వరత్వరగా పురమాయించాడు రామారావు.

"చూడు బాబూ! మీరెవరు? ఎందుకు వచ్చారిక్కడికి?" అని ఆ కుర్రవాడిని అనునయంగా అడిగాడు రామారావు.

"మాది రాజమండ్రి అండీ! మా అమ్మా, మేమంతా నెల్లూరుకి వెళ్తున్నామండీ! మాకు టిక్కెట్లు లేవని ఈ ఊళ్లో దింపేశారండీ! మొన్నటి నుంచీ మేమెవ్వరం అన్నం తినలేదండీ! తమ్ముడు పాలకోసం గోలపెట్టి ఏడుస్తుంటే, ఎవరినైనా పైసలు అడిగి పాలు కొని పట్టుకురమ్మని అమ్మ పంపించిందండీ! ఇక్కడికి పైసలు అడుగుదామని వచ్చేసరికి- అక్కకి కళ్ళు తిరిగి పడిపోయిందండీ!" అంటూ గుడ్లనీళ్లు కక్కుకుంటూ చెప్పాడు ఆ కుర్రవాడు.

"అయ్యోపాపం.... మరి, మీ అమ్మ ఎక్కడ ఉంది?" అని అడిగాడు రామారావు.

"ఇక్కడికి దగ్గర్లోనే- సత్రంలో ఉందండీ..." అన్నాడు ఆ బాబు.

"చూడు బాబూ... నీ పేరేమిటి?" అని అడిగాడు రామారావు.

"నా పేరు సాయి! అక్క పేరు హేమ అండీ, తమ్ముడి పేరు ప్రకాశ్ అండీ!" అన్నాడు ఆ పిల్లవాడు- తన పేరుతో పాటు అందరి పేర్లూ చెప్తూ.

"మరి, మీ అమ్మతో పాటు ఇంకెవరైనా ఉన్నారా?" అని ప్రశ్నించాడు రామారావు.

"అమ్మతో పాటు పద్మిని అక్కయ్యా, ప్రభాకర్ తమ్ముడు కూడా ఉన్నారండీ!" అన్నాడు సాయి.

ఆ పిల్లల పేర్లు వింటుంటే... వాళ్ళది బ్రతికి చెడ్డ కుటుంబమనీ, చాలా కష్టాలలో ఉన్నారనీ అర్థమయింది రామారావుకి.

"మరి, మీ నాన్నగారు ఏమి చేస్తుంటారు?" అని అడిగాడు.

"మా నాన్నగారు లేరండీ... ఆయన చచ్చిపోయారండీ!" అన్నాడు సాయి. తండ్రిపేరు తలవగానే, తిరిగి గిరుక్కున కన్నీళ్లు తిరిగాయి ఆ చిన్నవాడికి.

"సార్... ఇవిగో నీళ్లు!" అంటూ వచ్చాడు దుర్గయ్య.

ఆ గ్లాసు అందుకుని, పలుచగా హేమ నుదుటి మీద చల్లి, ఆమె బుగ్గలనీ, నుదుటినీ, కళ్ళనీ తడిచేత్తో తుడవసాగాడు రామారావు.

కళ్ళు తెరచిచూసింది హేమ. ఆమెకి చేయి ఆసరా ఇచ్చి కూర్చోబెట్టాడు రామారావు. తలని అటూఇటూ తిప్పి, జనం వైపు చూసి ఏడవసాగింది హేమ.

అక్క లేవడం చూసి, ఏడుపు స్థాయి మరీ హెచ్చించి, మరింత గింజుకోసాగాడు చంటివాడు.

ఏడుస్తూనే, "ఊరుకోరా... నేను నిన్ను ఎత్తుకోలేనురా!" అంది హేమ నీరసంగా.

సాయి చేతుల్లోంచి పడిపోయేటట్లుగా గింజుకోసాగాడు వాడు.

"బాబూ... ఇలా రా– అక్క దగ్గరికి వెళ్దువుగాని!" అంటూ ఆ పసివాడిని చేతుల్లోకి తీసుకున్నాడు రామారావు.

"అయ్యా! కాఫీ, బన్నూ తెచ్చాను..." అంటూ వచ్చాడు వెంకన్న.

"ఆఁ... ఆఁ..! బన్నుని ముక్కలు చేసి ముగ్గురికీ పెట్టు. అది తినేలోపున కాఫీని చల్లార్చు!" అంటూ పురమాయించాడు రామారావు.

రామారావు చేతిలోని బన్నుని చూడగానే– ఎలుకని తన్నుకుపోయే గ్రద్దలాగా ఒక్క ఉదుటున ఆ ముక్కని లాగేసి తినడం మొదలుపెట్టాడు ఆ పసివాడు.

'ఇచ్చిన ముక్కలు తినడమా? మానడమా?' అనుకుంటూ, ఒకరి ముఖాలు మరొకరు చూసుకున్నారు హేమా, సాయీనూ.

వారి సంశయం గ్రహించి, "తినండమ్మా... ఫర్వాలేదు!" అని ధైర్యం చెప్పాడు రామారావు. వాళ్ళు తినడం మొదలు పెట్టగానే –

"ఒరేయ్ఁ వెంకన్నా... ఒక రిక్షాని పిలు!" అన్నాడు రామారావు.

"చిత్తం..!" అంటూ బయటికి వెళ్లాడు వెంకన్న. మరునిముషంలో రిక్షాతో తిరిగి వచ్చాడు. ఈలోగా వాళ్ళు బన్ను తినడం, కాఫీ త్రాగడం పూర్తయింది.

"చూడు పాపా... మీరు ముగ్గురూ రిక్షాలో మా ఇంటికి వచ్చేయండి! మా ఇల్లు దగ్గరేలే! మీ అమ్మనీ, వాళ్ళనీ కూడా అక్కడికే రప్పిస్తాను. మీరంతా ఈ రాత్రి మా ఇంట్లోనే భోజనం చేద్దురుగానీ! ఆఁ... మీ అమ్మ పేరు ఏమిటి?" అన్నాడు రామారావు.

"పార్వతి అండీ..." అంది ఆ అమ్మాయి.

"ఎన్నో నంబరు గదిలో ఉంటుంది?" అని మళ్లీ అడిగాడు రామారావు.

"పదమూడవ నంబరు గదిలోనండీ!" అంది ఆ అమ్మాయి.

"మంచిది!" అని, "చూడు వెంకన్నా... నేను వీళ్ళ రిక్షా వెంబడి నా సైకిలు మీద ఇంటికి వెళ్తాను. నీవు సత్రానికి వెళ్లి, వీళ్ళమ్మా వాళ్ళని మనింటికి తీసుకునిరా!" అన్నాడు రామారావు.

"చిత్తం..." అంటూ వెళ్లిపోయాడు వెంకన్న.

పిల్లల్ని రిక్షా ఎక్కించి, అది కదలగానే తనూ సైకిలు ఎక్కాడు రామారావు.

అక్కడ, ఆ కాసేపట్లో జరిగినదంతా నమ్మలేనంతటి విచిత్రమైన సంఘటన అన్నట్లుగా వింతగా చెప్పుకోసాగారు జనం.

●

మరొక పది నిమిషాలలో రిక్షా రామారావు ఇంటి ముందు ఆగింది.

పిల్లలు రిక్షా దిగగానే- డబ్బులు ఇచ్చి రిక్షావాడిని పంపించేసి, పిల్లల్ని తీసుకుని లోనికి వెళ్లాడు రామారావు.

అలికిడి విని, లోపలనుంచి బయటకి వచ్చింది సుమతి. 'ఎప్పుడూ చూడని ఈ బంధువులు ఎవరా..?' అని ఆశ్చర్యపోసాగింది.

"రండమ్మా... ఇలా కూర్చోండి!" అంటూ పిల్లల్ని ముందు వసారాలో కూర్చోపెట్టి, "సుమతీ... ఇలా రా!" అని పిలిచాడు రామారావు లోనికి దారితీస్తూ.

సుమతి లోనికి వెళ్లి - "ఎవరండీ వీళ్ళు?" అని అడిగింది.

"చెప్తాలే! ముందు కాసిని పాలు కలుపు... చంటిపిల్లాడు గోల పెడ్తున్నాడు!" అన్నాడు రామారావు ఆదుర్దాగా.

అమూల్ స్ప్రే డబ్బా తీసి, పాలు కలుపసాగింది సుమతి.

"చూడు సుమతీ! పాపం... వాళ్ళెవరో బ్రతికి చెడ్డవాళ్ళు! ఆ పిల్ల కళ్ళు తిరిగి పడిపోతే, కాసిని నీళ్లైనా చల్లకుండా వింత చూస్తూ ఉండిపోయారు జనం! ఇలా ఉంటుంది లోకం!" అంటూ జరిగింది చెప్పాడు రామారావు- ఆమె పాలు కలుపుతుంటే.

"అయ్యో పాపం!" అంటూ జాలిపడింది సుమతి పాలను తిరగపోస్తూ.

"కొంచెంసేపట్లో వాళ్ళమ్మా, పిల్లలు కూడా ఇక్కడికే వస్తారు. ఈ రాత్రికి వీళ్ళందరినీ మనింటికే భోజనానికి రమ్మన్నాను. నీతో చెప్పకుండా ఇంతమందిని ఇంటి మీదికి తీసుకుని వచ్చాను..." అన్నాడు రామారావు.

"అలా అంటారేమిటి? ఇంకానయం... ఇంతకంటే ఉప్పు, ఉపకారం ఇంకేమి చేస్తాం మనం?" అంటూ చల్లారిన పాలగ్లాసులు తీసుకొని వసారాలోకి వెళ్లింది సుమతి.

వెనకాలే వెళ్లాడు రామారావు.

హేమ దగ్గర ఉన్న పాలసీసాని తీసుకుని, పాలని అందులో పోసింది సుమతి. సీసాని తిరిగి హేమకి ఇస్తుండగానే- చంకలోనున్న పిల్లాడు అక్క చేతిలోంచి పాలసీసాని ఒక్క ఉదుటున లాక్కొని, గుటుకూ గుటుకూ త్రాగడం మొదలుపెట్టాడు.

నిమిషంలో సీసా ఖాళీ అయింది.

●

ఇంటిముందు రిక్షా ఆగింది.

వెంకన్న సైకిలుని రోడ్డు మీదే ఆపి, తాళం వేసి లోపలికి వచ్చాడు.

అతని వెనకాలే ఒక నడివయస్కురాలు, ఇద్దరు పిల్లలూ లోనికి వచ్చారు. లోనికి వస్తూనే ఆమె సుమతికీ, రామారావుకీ నమస్కరించింది. వచ్చినవాళ్ళని కూర్చోబెట్టి -

"మీది ఏ ఊరండీ?" అని అడిగింది సుమతి.

"మాది రాజమండ్రి అండీ- ఒకప్పుడు బాగా ఉన్నవాళ్ళమే! మావారు బట్టల వ్యాపారం చేసేవారు. ఏడాది క్రితం జబ్బుచేసి చనిపోయారు. మాకు వ్యాపార విషయాలేవీ తెలియవు. ఆయన పోగానే, వాటాదార్లు మమ్మల్ని అన్యాయం చేశారు. అప్పటినుంచీ మేము పడుతున్న పాట్లు ఆ పరమేశ్వరుడికే ఎరుక! పోనీ, ఏ పనైనా చేద్దామంటే ఉన్న ఊళ్లో, ఘనంగా బ్రతికినచోట చేయడానికి మనసొప్పదు. అందులోనూ బ్రాహ్మణ కుటుంబం అవటంతో- వేలెత్తి చూపించేవారే ఎక్కువ- అవసరానికి ఆదుకునేవాళ్ళు లేకపోయినా! ఇంక లాభం లేదనుకొని నెల్లూరులో మా చెల్లెలు ఉంటే, ఆమె పంచన నాలుగు రోజులుండి ఏదైనా వంటా, వార్పూ చేసుకుందామని వెళ్తున్నామమ్మా! ఊరుకాని ఊళ్లో మమ్మల్ని గురించి పట్టించుకునే వాళ్ళుండరుగా! అలా వెళ్తుంటే మా దగ్గర టిక్కెట్లు లేవని ఈ ఊళ్లో దించేశారు. రెండురోజుల నుంచీ అందరం పస్తే ఉన్నాం!" అంటూ దీనంగా చెప్పింది పార్వతమ్మ.

ఆమె దీనగాథ వింటుంటే రామారావుకీ, సుమతికీ హృదయం ద్రవించిపోయింది.

"పిన్నిగారూ! ఇంక నేను వెళ్లి వంట ప్రయత్నం చేసి వస్తాను..." అంటూ లేచింది సుమతి వరస కలుపుతూ.

"అమ్మా... ఇంతమందికీ చేయడమంటే కష్టం! నన్ను కూడా సహాయానికి రమ్మంటే వస్తాను" అంది పార్వతమ్మ.

"అబ్బే... కష్టమేమీ లేదండీ! ఎంతసేపు పడ్తుంది? మీరు అసలే నీరసంతో అలసిపోయి ఉన్నారు. కాసేపు విశ్రాంతి తీసుకోండి!" అంటూ లోనికి వెళ్లింది సుమతి.

వెనకాలే వెళ్లాడు రామారావు.

వంటచేస్తూ సుమతి అంది-

"ఏవండీ... ఓ మాట చెప్పమంటారా?" అని.

ప్రశ్నార్థకంగా చూశాడు రామారావు.

"మనకీ చిన్నచిన్న పిల్లలున్నారు. చేతిక్రింద ఆసరాగా కాని, పెద్దదిక్కుగా కాని మనకెవ్వరూ లేరు. వీళ్ళదయితే మంచి కుటుంబం! వాళ్ళ పెద్దమ్మాయిని మన దగ్గర ఉంచుకుందామండీ... మనకీ మనిషి సాయం ఉంటుంది!" అంది సుమతి.

"అదీ నిజమే! కాని, మన ఇష్టమేనా? వాళ్ళమ్మ ఒప్పుకోవద్దూ?" అన్నాడు రామారావు ఆలోచనగా.

"ఎందుకు ఒప్పుకోదండీ? ఒక పిల్ల బరువు వాళ్ళకి తగ్గుతుంది. ఆపైన ఇక్కడ హాయిగా ఉంటే వద్దంటారా?" అంది సుమతి.

"సరే... అలాగే అడిగి చూడు! అయితే వాళ్ళ భోజనాలు అయ్యాకనే అడుగు. ముందు అడిగితే మన మర్యాదలూ, ఆపేక్షలూ అన్నీ అందుకోసమే అనుకుంటారు" అన్నాడు రామారావు.

"అలాగేనండీ! వాళ్ళు వెళ్లేముందు అడుగుతాను..." అంది సుమతి.

ఇంతలో–

"అమ్మా... అమ్మా..." అంటూ వీధిలోంచి అరుచుకుంటూ వచ్చారు సుమతి పిల్లలు ముగ్గురూను ఆటలు ఆడుకుని. ఇంట్లో కొత్తవాళ్ళని చూసి గుట్టుచప్పుడు కాకుండా లోపలికి వచ్చి,

"ఎవరే అమ్మా?" అంటూ వాళ్ళమ్మని అడిగారు.

"మనవాళ్ళే లేరా!" అంది సుమతి.

"మనకి ఏమవుతారే?" అన్నాడు రెండో వాడు.

"అవన్నీ తర్వాత చెప్తాలెండిరా! ముందు కాళ్లు కడుక్కుని బట్టలు మార్చుకుని రండి!" అంది సుమతి.

పిల్లలు దొడ్లోకి పరిగెత్తారు.

మరోగంటలో అతిథులందరికీ భోజనాలు పెట్టింది సుమతి. ఉన్నంతలో విందుభోజనం లాగా చేసి, బంధువుల పట్ల మర్యాద చూపినట్లే చూపింది.

భోజనం చేస్తున్నంతసేపూ పార్వతమ్మ– సుమతి దంపతులను అనేక విధాల పొగడసాగింది. కృతజ్ఞతతో ఆమె కంఠం మాటిమాటికీ జీరవోయి, అశ్రువులు కారసాగాయి.

భోజనాలు అయ్యాయి!

ఆ తర్వాత పార్వతమ్మ "అమ్మా! మీకు ఎంతో శ్రమ ఇచ్చాం. మీ ఋణం జన్మజన్మలకీ తీర్చుకోలేం. ఇంక సెలవు ఇప్పించండి... పోయి వస్తాం!" అంటూ లేచింది.

"అమ్మా! ఈ డబ్బు మీ దగ్గర ఉంచండి... దారి ఖర్చులకు పనికివస్తుంది!" అంటూ పది రూపాయలు ఇయ్యబోయాడు రామారావు.

"అయ్యో! చేసిన ఉపకారం చాలక ఇంకా ఈ శ్రమ కూడానా? వద్దు బాబూ... వద్దు" అంటూ వాపోయింది పార్వతమ్మ.

"ఫర్వాలేదు... తీసుకోండి పిన్నిగారూ! కష్టాలు కలకాలం ఉండవు. కష్టాల్లో ఒకరినొకరు ఆదుకోకపోతే ఎట్లా?" అంది సుమతి.

విధిలేక బలవంతాన తీసుకుంది పార్వతమ్మ.

ఆమె సెలవు తీసుకోబోతుండగా సుమతి– "పిన్నిగారూ! మీరు మరోలా అనుకోకుండా ఉంటే ఒక మాట అడగాలనుకుంటున్నాను..." అంది.

"అయ్యో! ఎంత మాట? అడగండమ్మా!" అంది పార్వతమ్మ.

"మరేం లేదు పిన్నిగారూ! మీరా కష్టాల్లో ఉన్నారు... వాటిని ఒక్కసారి తీర్చడం ఎవరికీ సాధ్యం కాదు. మాకు అంతా చిన్నపిల్లలు– ఆసరా ఎవరూ లేరు. అందువల్ల మీరు మరోలా అనుకోకపోతే– మీ హేమని మా దగ్గర ఉంచేస్తే మాకు తోడుగా ఉంటుంది. మా పిల్లలాగా చూసుకుంటాం. ఏ లోటూ రానియ్యం... ఏమంటారు?" అంది సుమతి మొహమాట పడ్తూ.

ఒక్కక్షణం ఏమీ మాట్లాడలేదు పార్వతమ్మ.

తర్వాత నెమ్మదిగా– "అమ్మా! మీవంటి పుణ్యాత్ములు కోరి నా పిల్లను తీసుకుంటామంటే కళ్ళ కద్దుకుని ఒప్పుకోవచ్చు. కాని, కడుపు తీపి నేను చంపుకోలేనమ్మా! తిన్నా, పస్తున్నా నా బిడ్డలు నా దగ్గర ఉండడంలోనే నాకు తృప్తి ఉంది తల్లీ! రోజులు గడవకపోయిన నాడు– కట్టకట్టుకుని ఏ గంగలోనో దూకుతామే కాని, పిల్లలని వదిలి నేను ఉండలేను తల్లీ! మీ మాట కాదన్నందుకు మన్నించండి!" అంటూ కళ్ళనీరు పెట్టుకుంది.

"అలాగే... మీ ఇష్టం! బలవంతం ఏమీ లేదు..." అంది సుమతి.

సెలవు తీసుకుని పార్వతమ్మ పిల్లలతో వెళ్లిపోయింది.

●

ఆరోజు రామారావు భోజనం చేసి, ఆదివారం అవడం వల్ల తీరిగ్గా పేపరు చదువుకుంటున్నాడు.

ప్రక్కనే కూర్చుని సుమతి ఏవేవో మాట్లాడుతోంది.

ఉన్నట్లుండి కంగారుగా, "సుమతీ... ఈ బొమ్మ చూడు!" అని అరిచాడు రామారావు.

"ఏమిటండీ అది?" అంటూ ఫోటో చూసి,

"వీళ్ళు పార్వతమ్మ పిల్లల్లాగా ఉన్నారు కదండీ!" అని అరిచింది సుమతి.

"అవును... వాళ్ళే! 'ఆకలి బాధకి తాళలేక తల్లీ, ఐదుగురు పిల్లలూ పెన్నానదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు!' అని వేశారు. దీంట్లో వాళ్ళ పేర్లు కూడా వ్రాశారు. అయ్యో... ఎంత దారణం జరిగింది!" అంటూ వాపోయాడు రామారావు.

"హుఁ... చేతులారా చేసుకుంది! హేమని మనకి ఇచ్చి ఉంటే, కనీసం ఆ పిల్లయినా బ్రతికి ఉండేది. కడుపు తీపి అంటూ కన్నబిడ్డల ప్రాణాలు తీసింది పార్వతమ్మ!" అంది సుమతి బాధగా.

"అదే సుమతీ... మనకి అర్థంకానిది! తల్లిమనసు అటువంటిది! బ్రతికినా, చచ్చినా తన బిడ్డలు తన దగ్గరే ఉండాలని కోరుకుంటుంది తల్లి! అలాంటి పరిస్థితుల్లో మనం కూడా అట్లాగే చేస్తామేమో!" అన్నాడు రామారావు.

'రోజులు గడవక పోయిననాడు కట్టకట్టుకుని గంగలో దూకుతాను కాని, పిల్లల్ని వదిలి ఉండలేను తల్లీ!' అని పార్వతమ్మ అన్నమాటలు ఆ దంపతుల చెవుల్లో మారుమ్రోగుతున్నాయి.

"పార్వతమ్మ కుటుంబాల లాంటివి ఇంకెన్ని ఉన్నాయో? వాటికి ముక్తి లేదా?" అంది సుమతి బాధగా.

"అది శేషప్రశ్నే సుమతీ! దానికి ఎవరూ సమాధానం చెప్పలేరు. అందుకే తన ముక్తిని తాను చూసుకుంది పార్వతమ్మ!" అన్నాడు రామారావు.

*'విజయ' మాసపత్రిక . . . మే, 1977*

అమ్మకానికి అందుబాటులో ఉన్న
కె.ఆర్.కె. మోహన్ ఇతర రచనలకై ఈ పుస్తకం చివరిపేజీల్లో చూడండి...